
సాక్షి
గుంటూరు
మంగళవారం । 11 । జూన్ । 2024



**పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు**
రేపల్లె రూరల్: పాఠ్యపుస్తకాలు మండల విద్యావనరుల కేంద్రానికి చేరాయి. తొలి విడతగా 13,289 పుస్తకాలు సోమవారం చేరుకున్నాయి.



**సాగర్ నీటిమట్టం**
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.70 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



**మల్లేశ్వరుని సేవలో చినరాజప్ప**
పెదకాకాని: పెదకాకాని మల్లేశ్వరస్వామిని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## న్యూస్‌రీల్

### మా వాళ్లకు ఇచ్చుకోవాలి.. మీరు తప్పుకోండి

**రేషన్ డీలర్లకు టీడీపీ నేతలు హుకుం**

**అచ్చంపేట:** మా కార్యకర్తలకు ఇచ్చుకోవాలి.. మీరు స్వచ్ఛందంగా తప్పుకోండి.. లేకుంటే బలవంతంగానైనా తప్పించాల్సి వస్తుందంటూ రేషన్ డీలర్లకు టీడీపీ నాయకులు హుకుం చేరీ చేశారు. అచ్చంపేట మండలంలో 53 రేషన్ షాపులు ఉన్నాయి. వీటిలో 40 మంది వరకు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఉన్నారు. మిగిలిన 13 మంది టీడీపీ వారిని కొనసాగించి, 40 మందిని తప్పించి టీడీపీ కార్యకర్తలకు డీలర్‌షిప్‌లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. నామినేటెడ్ పదవులలో ఉన్నవారినీ తప్పుకోవాలని సంబంధిత శాఖల ద్వారా ఇప్పటికే నోటీసులు జారీ చేయించారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్, ఇద్దరు డైరెక్టర్లకు నోటీసులు జారీ చేశారు. వారిని తప్పించి టీడీపీ వారికి ఇచ్చే యత్నాలు చేపట్టారు. ఎన్నికల విధులకు వచ్చిన మండల స్థాయి అధికారులు సీఎం ప్రమాణ స్వీకారం అయిపోగానే గతంలో వారు పనిచేసిన ప్రదేశాలను వెళ్లనున్నారు. ఆ స్థానాలలో వారికి ఇష్టమైన అధికారులను తెచ్చుకునేందుకు టీడీపీ వర్గాలు యోచిస్తున్నాయి.

### దూరవిద్య ప్రాక్టికల్స్ ప్రారంభం


**నరసరావుపేట ఈస్ట్:** సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. తొలిరోజు భౌతిక శాస్త్రం పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 129 మందికి 109 మంది హాజరు కాగా, 20 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. రసాయన శాస్త్రం పరీక్షకు 99 మందికి 78 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరైనట్టు వివరించారు. పట్టణంలోని సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఏ కేంద్రంలో ఫిజిక్స్ పరీక్షకు 36 మందికి 32 మంది, కెమిస్ట్రీ పరీక్షకు 32 మందికి 24 మంది, బీ కేంద్రంలో ఫిజిక్స్‌కు 45 మందికి 38 మంది, కెమిస్ట్రీకి 35 మందికి 25 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఫిజిక్స్ పరీక్షకు 48 మందికి 39మంది, కెమిస్ట్రీ పరీక్షకు 32 మందికి 25 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఎ.హుస్సేన్ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

### ప్రత్తిపాడులో 24.4 మి.మీ. వర్షం



**కొరిటెపాడు(గుంటూరు):** గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 24.4 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా దుగ్గిరాల మండలంలో 0.8 మి.మీ. వర్షం పడింది. సగటున 5.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా గుంటూరు తూర్పు 21, గుంటూరు పశ్చిమ 16.8, పెదనందిపాడు 16.2, వట్టిచెరుకూరు 7.2, చేబ్రోలు 4.2, తెనాలి 3.8, పెదకాకాని 1.4, కాకుమాను 1.2, మేడికొండూరు మండలంలో 1.2 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూన్ 10వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 32.4 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 50.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

### 14,739 బస్తాల మిర్చి అమ్మకం



**కొరిటెపాడు(గుంటూరు):** గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 22,442 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 14,739 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 19,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 12,500 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 13,000 నుంచి రూ. 12,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 7,703 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

# నేనే మంత్రి

**మంత్రి రేస్‌లో బాపట్ల జిల్లా టీడీపీ నేతలు**

- జీసీ కోటాలో తనకే మంత్రి పదవి అంటున్న అనగాని
- తనకు మాట ఇచ్చారంటున్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి
- ఎస్సీ కోటాలో మంత్రిని నేనేనంటూ నక్కా ఆశాభావం
- తనకే మంత్రి పదవి అంటున్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి
- ఎవరికి వారు ప్రయత్నాలు

**సాక్షి ప్రతినిధి,బాపట్ల:** సార్వత్రిక ఎన్నికల తంతు ముగిసింది.. ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఇంక మంత్రి పదవులకోసం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు పోటీపడుతున్నారు. చాపకింద నీరులా ఎవరి ప్రయత్నాలు వారు సాగిస్తున్నారు. కొందరు లోకేష్ మెప్పుకోసం తంటాలు పడుతుంటే.. మరికొందరు చంద్రబాబును ప్రభావితం చేసేందుకు సకల యత్నాలు సాగిస్తున్నారు. మొత్తంగా తమకే మంత్రి పదవి వస్తుందంటూ ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనుండటంతో జిల్లానుంచి మంత్రి పదవి ఎవరిని వరిస్తోందోనని ఆ పార్టీనేతలు, కార్యకర్తలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

### తనకే మంత్రి పదవి అంటున్న పర్చూరు ఎమ్మెల్యే..



తాను కూడా మంత్రి రేస్‌లో ఉన్నట్లు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఏలూరి సాంబశివరావు వరుసగా మూడవసారి పర్చూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. చంద్రబాబు, లోకేష్‌లతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మొదటి నుంచి పార్టీలో ఉన్నారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరిలు ఇద్దరూ చంద్రబాబు సామాజికవర్గంవారే. దీంతో ఇద్దరిలో ఒకరికే మంత్రి వర్గంలో స్థానం దక్కే అవకాశముంది. గొట్టిపాటి గత ఎన్నికల ముందు మాత్రమే టీడీపీలో చేరారని, ఆ పరంగా చూసినా ఆది నుంచి పార్టీలో ఉన్న ఏలూరికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని ఆయన అనుచరులు లెక్కలు వేస్తున్నారు. పైగా లోకేష్ నుంచి హామీ వచ్చినట్లు ఆయన అనుచర గణం చెబుతుతోంది. మొత్తంగా తనకు మంత్రి పదవి దక్కనుందని ఏలూరి ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన ఇద్దరిలో ఎవరికి మంత్రి పదవి లభిస్తుందో వేచిచూడాల్సివుంది.

### మంత్రి రేస్‌లో గొట్టిపాటి..



అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం దక్కనున్నట్లు సమాచారం. 2014 ఎన్నికల్లో అద్దంకి నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచిన గొట్టిపాటి రవికుమార్ ఆ తర్వాత చంద్రబాబు, లోకేష్ ఒత్తిళ్లతో ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. అద్దంకి నుంచి 2019, 2024 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. చంద్రబాబు, లోకేష్‌లతో సత్సంబంధాలు నెరిపారు. అధికారంలోకి రాగానే గొట్టిపాటిని మంత్రిని చేస్తామని ఎన్నికల ప్రచారంలో లోకేష్ చెప్పారు. చంద్రబాబు, లోకేష్‌లు ఇచ్చిన హామీ మేరకు తనకే మంత్రి పదవి దక్కనుందని గొట్టిపాటితోపాటు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. ఈమేరకు చంద్రబాబు మంత్రివర్గంలో గొట్టిపాటికి స్థానం దక్కనుంది.

### బీసీ కోటాలో అనగానికి..?



రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు చంద్రబాబు మంత్రి వర్గంలో స్థానం దక్కనుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. బీసీ సామాజికవర్గానికి చెందిన అనగాని ఆది నుంచి టీడీపీలో ఉన్నారు. పైగా 2014, 2019, 2024లలో వరుసగా మూడవసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఈ దఫా బీసీ కోటాలో అనగాని సత్యప్రసాద్ బాబు మంత్రివర్గంలో మంత్రిగా ఉంటారని ఆ పార్టీ వర్గాల్లోనూ చర్చసాగుతోంది. అనగానికి మంత్రి పదవి ఖాయమైందని ఆయన అనుచరులు ధీమాతో ఉన్నారు.

మొత్తంగా జిల్లా నుంచి నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం మంత్రాంగం నడిపిస్తున్నా.. అటు అనగాని సత్యప్రసాద్‌కు, ఇటు గొట్టిపాటి రవికుమార్‌కు చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం దక్కడం ఖాయమన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే చివరకు రేస్‌లో ఎవరు ముందుంటారో? వేచి చూడాల్సివుంది.

### మంత్రి పదవి కోసం నక్కా ప్రయత్నాలు



వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు ఎస్సీ కోటాలో మంత్రి పదవి దక్కే అవకాశముందని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. నక్కా ఆనందబాబు మొదటినుంచి పార్టీని అంటిపెట్టుకొని ఉన్నారు. 2009, 2014 ఎన్నికల్లో వేమూరు నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014 టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా చేశారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేరుగ నాగార్జున చేతిలో ఓటమి చెందారు. ఈ ఎన్నికల్లో తిరిగి టీడీపీ తరపున గెలుపొందారు. దీంతో చంద్రబాబు మంత్రివర్గంలో మంత్రి పదవిని ఆశిస్తున్నారు. అయితే నక్కా ఆనందబాబుకు గతంలో మంత్రిగా అవకాశం కల్పించిన నేపథ్యంలో ఈ దఫా ఆయనకు మంత్రి వర్గంలో స్థానం లేదన్న ప్రచారం ఉంది.

## లాంఫాంలో అమ్మకానికి మిరప విత్తనాలు సిద్ధం

**గుంటూరు రూరల్:** ఉద్యాన పరిశోధనా స్థానం లాం ఫాంలో జూన్ 13 గురువారం నుంచి ఎల్‌సీఏ-625 రకం, ఎల్‌సీఏ-643 మిరప రకాల ఫౌండేషన్ విత్తనం అమ్మనున్నట్లు పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత డాక్టర్. కె.గిరిధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌సీఏ-643 రకము కాయలు బాగా పొడవుగా, లావుగా, అధిక ఘాటు, రంగు కలిగి ఎండిన కాయలు బ్యాడిగ రకం వలె ముడతలు కలిగి ఉంటుందని పేర్కొన్నారు. ఈ రకము పచ్చి మిరప, ఎండు మిరపకు అనువైన రకమని తెలిపారు. ఎల్‌సీఏ-625 అను రకము కాయలు మధ్యస్థ పొడవుతో సన్నగా ఉండి, అధికమైన ఘాటుతో మంచి రంగును కలిగి ఉంటాయని పేర్కొన్నారు. కోత ఆలస్యమైనప్పటికీ కాయ రంగును కోల్పోదని, కాయ నిల్వలో 2 – 3 నెలలు రంగును కోల్పోకుండా ఉంటుందని వివరించారు. బెట్టను తట్టుకోగల రకమని, ఎద పెట్టి నాటుకోవటానికి మిక్కిలి అనుకూలమైన రకమని చెప్పారు. విత్తనాలు కొనదలచిన రైతులు నేరుగా ఉద్యాన పరిశోధనా స్థానం, లాం ఫాంలో ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల లోపు విత్తనాలు అందుబాటులో ఉన్నంత వరకు పొందవచ్చని పేర్కొన్నారు. రెండవ శనివారం, ప్రతి ఆదివారం సెలవని వెల్లడించారు. కిలో విత్తనాల ధర రూ 1,200లని చెప్పారు. ఈ రకం మిరప విత్తనాలు కేవలం ఉద్యాన పరిశోధనా స్థానం, లాం ఫారం నందు మాత్రమే పొందగలరని స్పష్టం చేశారు. అవే పేర్లతో బయట ఎవరైనా ఈ విత్తనాలు విక్రయిస్తుంటే రైతులు వాటిని ఖరీదు చేసి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. మరిన్ని పూర్తి వివరాలకు 99898 09554 , 73826 33661 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. లాఫాంలోనూ సంప్రదించవచ్చని వెల్లడించారు.

## నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

**గుంటూరు ఏడీఏ సునీల్**

**కొరిటెపాడు(గుంటూరు):** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అమ్మాలని గుంటూరు ఏడీఏ ఎం.సునీల్ సూచించారు. రైతులకు నాసిరకం, కల్తీ విత్తనాలు అంటగడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఆయన రాజాగారితోటలోని శ్రీరామ సీడ్స్, కోస్టల్ సీడ్ హౌస్ విత్తన దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి రికార్డులను పరిశీలించారు. స్టాకు రిజిస్టర్‌లోని స్టాకు వివరాలతోపాటు, గిడ్డంగుల్లోని స్టాకును పరిశీలించారు. అమ్మకం, కొనుగోలు రికార్డులనూ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ సునీల్ మాట్లాడుతూ విత్తన, ఎరువుల దుకాణాలు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, నాసిరకమైన విత్తనాలు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులు ఒకటికి రెండు సార్లు పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. అనంతరం క్రిస్టల్ కంపెనీ, వానపాముల కంపెనీ, అమర్ బయోటెక్, సదానంద్ విత్తనాల నమూనాలు సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. తనిఖీల్లో ఏడీఏతో పాటు గుంటూరు అర్బన్ ఏఓ బి.అంజిరెడ్డి, గుంటూరు రూరల్ ఏఓ ఐ.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



విత్తన దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్, ఏఓలు అంజిరెడ్డి, సుబ్రమణ్యం

### నిమ్మకాయల ధరలు

**తెనాలి:** గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4000, గరిష్ట ధర రూ.6000, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.



## స్తంభించిన జనన, మరణ నమోదు



నగరపాలక సంస్థలో జనన, మరణ విభాగ కార్యాలయం



సర్టిఫికెట్ల ప్రింటవుట్ రావడం లేదని తెలియజేస్తూ ఏర్పాటు చేసిన పోస్టర్

- గత నెల 18 నుంచి పనిచేయని వెబ్‌సైట్ సర్వర్
- ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల పాట్లు
- నగరపాలక సంస్థ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- త్వరగా వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకురావాలని వినతి

**నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్):** నగరపాలక సంస్థ పరిధిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడానికి ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. గతనెల 18 నుంచి వెబ్‌సైట్ సర్వర్ పని చేయట్లేదు. ఫలితంగా ప్రజలు నగరపాలక సంస్థ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయితే ఎప్పుడు వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తుందో కార్పొరేషన్ సిబ్బంది చెప్పలేకపోతున్నారు.

**అప్‌డేట్ వల్లేనా..!**

టీడీపీ అధికారంలోకి రావడంతో అన్ని వెబ్‌సైట్లను మారుస్తున్నట్టు సమాచారం. సీఎం, మంత్రుల చిత్రాలు మార్చాల్సి ఉన్నందున ఒక్కో వెబ్‌సైట్‌ను అధికారులు అప్‌డేట్ చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనిలో భాగంగా జనన, మరణ ధ్రువీకరణ వెబ్‌సైట్‌నూ మారుస్తున్నట్టు సమాచారం. దీనివల్ల ఆలస్యమవుతుందని సిబ్బంది చెబుతున్నారు. అయితే ప్రజలు ధ్రువీకరణ పత్రాలు దక్కక పాట్లు పడుతున్నారు. త్వరగా వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

## వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు దారుణం

- రాజకీయాల్లో గెలుపోటములు సహజం
- జనసేన, టీడీపీ కార్యకర్తలు విధ్వంసం సృష్టిస్తున్నారు
- అన్ని రాజకీయ పార్టీలూ ముక్తకంఠంతో ఖండించాలి
- పాలేటి కృష్ణవేణి భర్తపై దాడి హేయం
- దోషులను పట్టుకుని కఠినంగా శిక్షించాలి
- ఎంటీఎంసీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి

**తాడేపల్లిరూరల్ :** రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత జనసేన, టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ (ఎంటీఎంసీ) అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యలను అన్ని రాజకీయ పార్టీలూ ఖండించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి

సోమవారం తాడేపల్లిలోని దొంతిరెడ్డి అంజిరెడ్డి భవనంలో వేమారెడ్డి విలేకరులతో మాట్లాడారు. 2019లో 151 సీట్లలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించినా.. ఎక్కడా ప్రత్యర్థి పార్టీల నాయకులపై దాడులకు పాల్పడలేదని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు కౌంటింగ్ రోజున కూటమి అభ్యర్థులు ముందంజలో ఉన్నారని తెలిసిన వెంటనే టీడీపీ, జనసేన కార్యకర్తలు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపైనా, నాయకులపైనా దాడులు మొదలు పెట్టారని విమర్శించారు. వీరిని నియంత్రించాల్సిన ఆ పార్టీల నాయకులు మరింత రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పెదవడ్లపూడికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాలేటి కృష్ణవేణి, ఆమె భర్త రాజకుమార్‌ను టీడీపీ నేతలు చంపుతామని బెదిరించారని, దీంతో వారు ఊరు వదిలి వెళ్లిపోయారని వివరించారు. అయినా విడిచిపెట్టని టీడీపీ నేత జవ్వాది కిరణ్‌చంద్ వారు ఎక్కడ ఉన్నారో కనుక్కొని వెళ్లి కృష్ణవేణి భర్త రాజకుమార్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకు తీసుకెళ్లి విచక్షణారహితంగా కొట్టి అర్ధనగ్నంగా నిలబెట్టి ప్రైవేటు భాగాలపై కొట్టి ఫొటోలు, వీడియోలు తీసి పైశాచిక ఆనందం పొందారని దొంతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జవ్వాది కిరణ్‌చంద్, అతడి అనుచరులపై కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని వేమారెడ్డి డిమాండ్ చేశారు. పోలీస్ వ్యవస్థ నిద్రావస్థలో ఉందని, అధికారులంతా కూటమి చేతిలో కీలుబొమ్మలయ్యారని ధ్వజమెత్తారు. తాము తమ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందవద్దని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, మాజీ అధ్యక్షులు పాటిబండ్ల కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణజెసియస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉండ్రు కళ్యాణ్, మేకా అంజిరెడ్డి, చిట్టిమళ్ళ సుబ్బారావు (సుబ్బు) తదితరులు పాల్గొన్నారు.

## 16న ప్రభుత్వ ఉపాధ్యాయులకు చేతిరాత నైపుణ్యంలో శిక్షణ

**గుంటూరు ఎడ్యుకేషన్:** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈనెల 16న చేతిరాత నైపుణ్యంలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చేతిరాత ఉద్యమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 3,480 మంది ఉపాధ్యాయులతోపాటు 36వేల మందికిపైగా విద్యార్థుల చేతిరాత అందంగా తీర్చిదిద్దిన క్యాలిగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే శిక్షణా తరగతులకు హాజరు కాగోరు ఉపాధ్యాయులు వై.నాగమణి (9182053084), ఇ.అనిల్ (9959085005), వి.రామమోహనరావు (9849544892) నంబర్లలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## ముగిసిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు



క్షేత్రం నాటికలోని సన్నివేశం

**పొన్నూరు:** ప్రముఖ రంగస్థల నటులు నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతి పురస్కరించుకుని పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో 23వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటికల పోటీల ప్రదర్శనలు ఉత్సాహంగా సాగాయి. ముగింపు ప్రదర్శనల్లో భాగంగా సోమవారం నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్లోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళా వేదికలో నాలోన నీవే నాటిక, క్షేత్రం నాటిక ప్రదర్శించగా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు అభ్యుదయ గీతాలు ఆలపించారు. నృత్యప్రదర్శనలతో కార్యక్రమాన్ని రంజింపజేశారు. అనంతరం పోటీలలో గెలుపొందిన కళా సంస్థలకు, కళాకారులకు మెమెంటోలు, బహుమతులు అందజేసి సత్కరించారు. కార్యక్రమాలను సంస్థ అధ్యక్షులు ఎస్.ఆంజనేయులు నాయుడు, గౌరవాధ్యక్షులు నన్నపనేని రఘునాథ్ కార్యనిర్వాహక అధ్యక్షులు ఆకుల సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎస్. శివకుమార్, కోటేశ్వరరావు, కార్యదర్శి సిహెచ్. వి.రామకృష్ణారావు పర్యవేక్షించారు.

## అత్తింటి వేధింపులకు వివాహిత బలి

**ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న వైనం**

**మార్టూరు:** భర్త, అతని కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక ఓ మహిళ ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ ఎస్వీ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు..

ప్రకాశం జిల్లా దర్శికి చెందిన కప్పెర పెద్ద అంజయ్య తన కుమార్తె గిరీష (21)కు మార్టూరు మండలం బొల్లాపల్లి గ్రామానికి చెందిన విభూది అంకారావుతో ఆరేళ్ల క్రితం వివాహం జరిపించాడు. ఈ దంపతులకు ఐదు సంవత్సరాల బాలుడు ఉన్నాడు. గిరీషను భర్త అంకారావు, అత్త మార్తమ్మ, బావ హనుమంతరావులు తరచూ వేధిస్తుండగా బాధలు తాళలేక రెండు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. భార్య గిరీషను బాగా చూసుకుంటానని నమ్మించిన అంకారావు ఇటీవల బొల్లాపల్లికి తీసుకువచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 10:30 గంటల ప్రాంతంలో మద్యం మత్తులో తన తల్లి మార్తమ్మ, సోదరుడు హనుమంతరావుతో కలిసి గిరీషపై విచక్షణారహితంగా దాడి చేశాడు. వారి వేధింపులు తాళలేని గిరీష ముందు గదిలోకి వెళ్లి గ్రిల్ తాళం వేసుకొని చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఫ్యాన్‌కు వేలాడుతున్న గిరీషను గమనించిన అంకారావు స్థానికులతో కలసి గది తాళం పగులగొట్టి కిందకు దించాడు. కొన ఊపిరితో ఉన్న గిరీషను చిలకలూరిపేట ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. గిరీష తండ్రి పెద్ద అంజయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## డయేరియా నివారణకు తక్షణ చర్యలు

**డీఎంహెచ్‌వో డాక్టర్ రవి**

**రెంటచింతల:** కలుషిత నీటి వల్లే అతిసార ప్రబలుతుందని, డయేరియా నివారణకు వెంటనే చర్యలు చేపట్టినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ రవి చెప్పారు. సోమవారం స్థానిక బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను సందర్శించి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేసి మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో అవకాశం ఉంటే మినరల్ వాటర్ తాగాలని.. కుళాయి నీరు అయితే కాచి చల్లార్చి తాగాలని పేర్కొన్నారు. తాగునీటి నమూనాలను సీహెచ్‌వో అండ్ ఆర్‌డబ్ల్యూఎస్‌తో పరీక్ష్ చేయించామని వెల్లడించారు. మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు కలుషితమవుతోందని, ఈ విషయం ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూస్ ఏఈకి, పంచాయితీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని డీఎంహెచ్‌వోకు వివరించారు. ఇంటింటి సర్వే నిర్వహించి సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయతీకి సూచించామని పేర్కొన్నారు. గ్రామంలోని సుబ్బన్నతోట కాలనీ, నాయుడుపేట ఎస్సీ కాలనీ, అంథోనివారి కాలనీ, వడ్డెరబావి సెంటర్, రైల్‌పేటలో ఇటీవల డయేరియా కేసులు వచ్చాయన్నారు. సీజనల్ వ్యాధులు పట్ల గ్రామస్తులందరూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు, హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది డి.సీతారామిరెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రెంటచింతల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రవి

### పాకాలపాడు సచివాలయానికి టీడీపీ జెండా

**సత్తెనపల్లి:** ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడంతో సత్తెనపల్లి మండలం పాకాలపాడులోని గ్రామ సచివాలయానికి టీడీపీ కార్యకర్తలు తమ పార్టీ జెండాను కట్టారు. జై టీడీపీ.. జై జై సీబీఎన్ అంటూ విక్టరీ వేళ్లు చూపుతూ నినదించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## క్లుప్తంగా

### రూపాయి మారకపు విలువపై చర్చ



కొరిటిపాడు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు మెయిన్ బ్రాంచి ఆధ్వర్యంలో ఎగుమతిదారుల సమావేశాన్ని గుంటూరులోని క్యాపిటల్ హోటల్‌లో సోమవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ డెప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణకుమార్ బి. ప్రభు పాల్గొన్నారు. దాదాపు 75 మంది ఎగుమతిదారులు హాజరయ్యారు. అంతర్జాతీయ ఎగుమతులు, రూపాయి మారకపు విలువల గురించి చర్చించారు. సమావేశంలో ఏజీఎంలు రాంప్రసాద్, సూర్యశేఖర్, డెప్యూటీ మేనేజర్ శ్రీను నాయక్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఖాదీ బోర్డు డైరెక్టర్ పదవికి చిట్టా రాజీనామా



ఫిరంగిపురం: రాష్ట్ర ఖాదీ విలేజీస్ అండ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్ పదవికి రేపూడి గ్రామానికి చెందిన చిట్టా అంజిరెడ్డి సోమవారం రాజీనామా చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంతో పార్టీ నాయకుడిగా నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు తెలిపారు. లేఖను మంగళగిరిలోని ప్రిన్సిపల్ సెక్రటరీ (ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ డిపార్‌మెంట్)కి అందజేసినట్లు చెప్పారు.

### గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



చీరాల: సముద్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం బాపట్ల సమీపంలోని పాండురంగాపురం సముద్ర తీరం వద్ద లభ్యమైంది. చీరాల మండలం కావూరివారిపాలేనికి చెందిన జైపాల్ (18) మరికొంత మంది స్నేహితులు ఆదివారం వేటపాలెం మండలం రామాపురంలోని సముద్రతీరానికి వచ్చారు. స్నానం చేస్తుండగా అలల తాకిడికి జైపాల్ గల్లంతయ్యాడు. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు రాత్రి గాలింపు చేపట్టారు. సోమవారం బాపట్ల సమీపంలో పాండురంగాపురం సముద్ర తీరానికి మృతదేహం కొట్టుకువచ్చింది. ఈ మేరకు పోలీసులు వివరాలతో కేసు నమోదు చేశారు.

# సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా!

పసుపు రైతులు, సంఘాల నేతలతో తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాదంలో పసుపు పంటను కోల్పోయిన రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ హామీనిచ్చారు. రైతులు అడుగుతున్న ధరకు, వచ్చే ఇన్స్యూరెన్స్ మధ్య వ్యత్యాసం రూ.8 వేలు ఉన్న విషయాన్ని తెలియజేస్తానన్నారు. ఇన్స్యూరెన్స్ చెల్లింపులో జాప్యంపై సంబంధిత ముంబై అధికారులతో నేరుగా మాట్లాడి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రైతు సంఘ నాయకులు, పసుపు రైతులు, అధికారులతో ఏర్పాటైన సమావేశానికి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అధ్యక్షత వహించారు. కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పసుపు పంట క్వింటాలుకు రూ.12,500 చొప్పున రైతులకు ఇప్పించడం ప్రభుత్వ బాధ్యతగా రైతుసంఘ నాయకులు స్పష్టం చేశారు. బాధిత రైతులకు నెల రోజుల్లోగా నగదును ఇప్పించేలా చూడాలని సబ్ కలెక్టర్‌కు విజ్ఞప్తిచేశారు. పసుపు పంట నష్టపోయిన రైతులకు క్వింటాలు రూ.12,500 వంతున నగదు లేదా నిల్వ చేసుకున్న పరిమాణంలో పసుపును ఇప్పించాలని రైతులు కోరారు. కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాదంలో కుట్రపూరితంగా వ్యవహరించిన యజమానిపై ఆర్ఆర్ యాక్ట్‌ను ప్రయోగించాలని డిమాండ్ చేశారు. ఆయన ఆస్తుల్ని అమ్మించి నెల రోజుల వ్యవధిలో డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతాంగం వద్ద కనీసం పంట నిల్వలు లేనందున గ్రామాల్లో అప్పు పుట్టటం కూడా కష్టంగా ఉందన్నారు. ఫ్లోటింగ్ ఇన్స్యూరెన్స్ బదులుగా ప్లాట్ ఇన్స్యూరెన్స్ చేయడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చిందని రైతుసంఘ నాయకులు చెప్పారు. ఇందులో మార్కెటింగ్ శాఖ, ఇన్స్యూరెన్స్ అధికారుల అలసత్వం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని ఆరోపించారు. కోల్డ్ స్టోరేజీలో అద్దె, వడ్డీలు, ఇన్స్యూరెన్స్ డబ్బులు ముక్కుపిండి వసూలుచేసిన యజమాని నిర్లక్ష్యం వైఖరితోనే రైతులు నష్టపోయారని తేల్చిచెప్పారు. నష్టపోయిన రైతులకు న్యాయం జరక్కపోతే భవిష్యత్‌లో పసుపు పండించాలన్నా, నిల్వ చేయాలన్నా భయపడే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, బాపట్ల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివసాంబిరెడ్డి, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, గద్దె శ్రీహరి, లంకిరెడ్డి నాగసుజాత, కొల్లి రంగారెడ్డి, పేర్ని రవికిషోర్, లంకిరెడ్డి నాగేశ్వరరెడ్డి, కె.రామస్వామి, చందు సత్యనారాయణ, గుళ్లపల్లి సుబ్బారావు, బొల్లిముంత రామారావు పాల్గొన్నారు.

# గంజాయి విక్రేతల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, పక్కన సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు

తెనాలి రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీన పర్చుకున్నారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మార్గాని రమేష్ వివరాలు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహమ్మద్ షఫీ సర్దార్ ఏడాదిగా తెనాలిలో ఉంటూ టైలర్‌గా పని చేస్తున్నాడు. ఒడిసా నుంచి గంజాయి తీసుకొచ్చి ఇక్కడ అమ్ముతున్నాడు. ఈ క్రమంలో ఇతనికి మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ రహమాన్, డొంక రోడ్డుకు చెందిన రాపోలు నరసింహారావు, చెంచుపేట భాను టీ స్టాల్ సమీపంలో నివసించే జమ్ముల్లమూడి గోపి, పాండురంగపేటకు చెందిన దిడ్ల ప్రభుదేవ, పినపాడుకు చెందిన ఆకురాతి భరత్, మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన సయ్యద్ మహమ్మద్ సోహైల్, డొంక రోడ్డుకు చెందిన కొమ్మతోటి పాలరాజు పరిచయమయ్యారు. వీరు గంజాయిని చిన్న పొట్లాలుగా కట్టి అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వీరి కదలికలపై నిఘా ఉంచగా బాలాజీరావుపేటలోని ఓ ఖాళీ స్థలంలో పొట్లాలు కడుతున్నారని ఆదివారం సాయంత్రం పక్కా సమాచారం రావడంతో త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు సిబ్బందితో ఆకస్మిక దాడులు చేశారు. నిందితులు పారిపోడానికి ప్రయత్నించగా వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 40 వేలు విలువ చేసే రెండు కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. నిందితుల్ని సోమవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. సమావేశంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ దేవప్రసాద్, కానిస్టేబుళ్లు పి. మురళి, వి. శ్రీహరి, డి. సురేష్, సీహెచ్. శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

**రౌడీషీట్లు తెరుస్తాం**

తెనాలి పోలీస్ సబ్ డివిజన్‌లో గంజాయి అమ్ముతూ పట్టుబడే వారిపై రౌడీషీట్లు తెరుస్తామని డీఎస్పీ రమేష్ హెచ్చరించారు. తలిదండ్రులు పిల్లల కదలికలపై దృష్టి ఉంచాలని సూచించారు. కళాశాలల యాజమాన్యాలతోనూ పోలీసు శాఖ తరఫున మాట్లాడతామని తెలిపారు. విద్యార్థులు గంజాయికి బానిసలై జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. గంజాయి వినియోగం, విక్రయాల్ని సహించేది లేదని స్పష్టం చేశారు.

## అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన యువతి ఆచూకీ గుర్తింపు



అమీరున్ మృతదేహం

పెదకాకాని: అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన యువతి ఆచూకీని 16 రోజుల తరువాత సోమవారం పోలీసులు గుర్తించారు. వివరాలు.. సత్తెనపల్లి టౌన్‌కు చెందిన సయ్యద్ రఫీకి తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన సయ్యద్ అమీరున్‌తో ఏడాది కిందట వివాహం జరిగింది. ఆమె ప్రస్తుతం మూడు నెలల గర్భవతి. గత నెల 22న సత్తెనపల్లి నుంచి భార్యాభర్తలు గుంటూరు వచ్చి ఓ గైనకాలజిస్ట్ వద్ద వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గర్భసంచి వీక్‌గా ఉందని, జాగ్రత్తగా ఉండాలని ఉందని డాక్టర్ సూచించారు. అనంతరం ఇద్దరూ రావెల చేరుకున్నారు. 23న అమీరున్‌కు గర్భస్రావం అయినట్లు గుర్తించినప్పటికీ ఆసుపత్రికి వెళ్లలేదు. అమీరున్ తల్లిని బస్సులో ఆసుపత్రి రావాలని సూచించి, 24న రావెల నుంచి గుంటూరు స్కూటీపై ఇద్దరూ బయలు దేరారు. అదే రోజు సాయంత్రం పెదకాకాని శివారు వై.జంక్షన్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో అమీరున్(20) మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించారు. మృతురాలి భర్త అప్పటి నుంచి పరారీలోనే ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్నిమార్చురీలో భద్రపరిచి, వివరాలను అన్ని పోలీస్ స్టేషన్లకు పంపారు. మృతురాలి పుట్టింటి వారు తాడికొండ పోలీసుస్టేషన్‌లో కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు చేసి, మృతదేహం అమీరున్‌దిగా గుర్తించారు. ఆసుపత్రి పేరుతో నమ్మించి తీసుకు వచ్చి మార్గంమధ్యలో అల్లుడు హతమార్చి పరారయ్యాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

# దొంగల హల్ 'సెల్'

ద్విచక్ర వాహనాలపై సాయం నటిస్తూ.. ఏమార్చి సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న వైనం



బాధిత వ్యక్తి (బ్లూ షర్టు) వ్యక్తి జేబులో నుంచి ఫోన్ తస్కరిస్తున్న బాలుడు

కొల్లూరు: ద్విచక్ర వాహనాలపై సెల్ ఫోన్ దొంగలు హల్‌చల్ చేస్తూ సినీ పక్కీలో ఫోన్లు చోరీ చేస్తున్న సంఘటనలు ఇటీవల ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఏమరపాటుగా ఉన్న వ్యక్తులనే లక్ష్యంగా చేసుకొని పట్టపగలే అత్యంత చాకచక్యంగా తస్కరించి ద్విచక్ర వాహనాలపై ఉడాయిస్తున్నారు. బాధితులు తమ ఫోన్ పోయిందని గ్రహించేలోపే ఆ ప్రాంతం నుంచి దొంగల ముఠా ద్విచక్రవాహనాలపై కనుమరుగైపోతున్నారు. దీంతో పోలీసులను ఆశ్రయించి తమగోడు వెళ్లబోసుకుంటున్నారు.

**తాజాగా కొల్లూరు శివాలయం సెంటర్‌లో..**

సోమవారం మధ్యాహ్నం కొల్లూరు శివాలయం సెంటర్ ప్రాంతంలో సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ తస్కరించిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం, సీసీ కెమెరాల్లో రికార్డయిన సమాచారం మేరకు.. భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన వ్యక్తి కొల్లూరు సెంటర్‌లోని ఓ సెల్ ఫోన్ దుకాణం నుంచి బయటకు వచ్చి తన వాహనాన్ని తీసేందుకు ప్రయత్నిస్తున్నాడు. అప్పటికే గమనిస్తున్న రెండు ద్విచక్ర వాహనాల్లోని నలుగురు యువకులు అతని వద్ద సెల్ ఫోన్‌ను చోరీ చేసేందుకు సిద్ధమయ్యారు. ముందుగా ద్విచక్ర వాహనంపై ఓ బాలుడ్ని దింపి వచ్చిన సెల్‌ఫోన్ దొంగల్లోని ఓ యువకుడు బాధిత వ్యక్తి ద్విచక్ర వాహనం వెనుక తన ద్విచక్ర వాహనం పడిపోతున్నట్లు కిందకు వాల్చి నటిస్తూ లేపాలని సాయం కోరాడు. దీంతో బాధిత వ్యక్తి పడిపోతున్న ద్విచక్ర వాహనాన్ని లేపేందుకు ఉపక్రమించాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న బాలుడు ద్విచక్ర వాహనం లేపుతున్న వ్యక్తితో పాటు తాను వాహనాన్ని లేపుతున్నట్లు నటిస్తూ అతని జేబులోని సెల్‌ఫోన్‌ను అత్యంత లాఘవంగా తస్కరించి అదే ద్విచక్రవాహనం ఎక్కి అక్కడ నుంచి పరారయ్యారు. వీరిరువురికి తోడుగా మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన మరో ఇద్దరు యువకులు సైతం వీరితో పాటు అక్కడ నుంచి మరో వాహనంపై ఉడాయించారు. రూ. 40 వేలు విలువైన సెల్‌ఫోన్ చోరీకి గురవడంతో బాధిత వ్యక్తి కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీలకు పాల్పడుతున్న యువకులు నంబర్‌లు లేని ద్విచక్ర వాహనాలు వాడుతూ, సాయం చేసేందుకు వచ్చే వారి సెల్‌ఫోన్‌లు తస్కరించడం గతంలో సైతం జరిగాయి. ఈ నేపథ్యంలో పోలీసు యంత్రాంగం సెల్ ఫోన్ దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## న్యూరో సర్జరీ విభాగానికి రెండు ప్రత్యేక వార్డులు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో న్యూరో సర్జరీ విభాగానికి రెండు ప్రత్యేక వార్డులు కేటాయించామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆయన సోమవారం న్యూరో సర్జరీ ఐసీయూను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో న్యూరో సర్జరీ ఐసీయూలో 10 పడకలు మాత్రమే ఉండేవని గుర్తు చేశారు. ఇదే వార్డులో నర్సింగ్ సిబ్బంది కూర్చునేందుకు కూడా సరైన వసతి లేదని, అరకొర వసతులతో రోగులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. ఈ పరిస్థితి గమనించి వెంటనే ప్రత్యేకంగా నెఫ్రో ఐసీయూను న్యూరో సర్జరీ పోస్ట్ ఆపరేటివ్ వార్డుగా, ఆర్ఐసీయూ న్యూరో సర్జరీ ట్రామా వార్డుగా అందుబాటులో తెస్తున్నామని తెలిపారు. న్యూరో ట్రామా ఐసీయూలో 18 పడకలు, నర్సింగ్ కౌంటర్‌ను నూతనంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. సెంట్రల్ ఏసీని కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రతి పడక వద్ద వెంటిలేటర్లు, మానిటర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. తలకు దెబ్బలు తగిలిన కేసులు ఎక్కువగా వస్తుండటంతో న్యూరో ట్రామా ఐసీయూను తీర్చి దిద్దుతున్నామని చెప్పారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఆస్పత్రిని బాగు చేస్తున్నామని, దానిలో భాగంగా 20 స్టూల్స్‌కు రంగులు వేసినట్లు చెప్పారు. అన్ని వార్డుల్లో సిబ్బంది సొంత ఇంట్లో మాదిరిగా స్వచ్ఛందంగా పని చేస్తున్నారని కిరణ్ కుమార్ తెలిపారు.

## గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలుచేయాలి

హిందూ సంఘాల ప్రతినిధులు వినతి



ఏఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

నగరంపాలెం: గోవధ నిషేధ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని హిందూ సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావుకి సోమవారం డీపీఓలో వినతిపత్రం అందజేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా కొందరు గోసంతతిని అక్రమ రవాణా చేస్తూ, గోవధ శాలలకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే కొన్ని వాహనాలను గో రక్షకులు నిలిపివేసి పోలీసుల సమక్షంలో గోశాలలో అప్పగించామని గుర్తు చేశారు. టోల్ గేట్ల వద్ద పోలీస్ పికెట్లు నెలకొల్పి, వాహనాలను తనిఖీ చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు చిరుమామిళ్ల గోపీకృష్ణ, ఏపీ హైందవ డెవలప్‌మెంటు సొసైటీ అధ్యక్షుడు బెహరా వెంకట అనిల్‌కుమార్, విశ్వ హిందూ పరిషత్ అర్చక పురోహిత్ జిల్లా అధ్యక్షుడు మాధవశర్మ, బ్రాహ్మణ సంఘాల నాయకుడు రామరాజు త్రికోటేశ్వరరావు, హిందూ ఐక్య పోరాట వేదిక నాయకులు సుభాష్, పార్థు, యశ్వంత్ పాల్గొన్నారు.

## 22, 23 తేదీలలో చాగంటి ప్రవచనాలు



మాట్లాడుతున్న వివిధ సంస్థల ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: పట్టణంలోని వివిధ సాంస్కృతిక, వ్యాపార, ఇతర సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీలలో రెండురోజుల పాటు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు. పల్నాడు రోడ్డులోని పల్నాడు కళాక్షేత్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గత జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ప్రోత్సాహంతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకున్నట్లు వివరించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అన్ని వసతులతో కూడిన జమిందార్ ఫంక్షన్ హాల్‌లో ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 22వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు, 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు తాను రచించిన నిత్య పూజా విధానం పుస్తకంలోని పూజా విధానాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అదేరోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రవచనం ఉంటుందని తెలిపారు. తాము బ్రహ్మశ్రీ చాగంటి వారిని కలసినప్పుడు రామాయణం, భారతం, భాగవతాలలో యువతకు ఉపయోగపడే అంశాలపై మాట్లాడవలసినదిగా కోరామన్నారు. పల్నాడు ప్రాంతంలో ప్రశాంత జీవనం సాగించేలా ప్రవచనం దోహదపడుతుందనే ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాక్షేత్రం ప్రతినిధులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, డాక్టర్ చదలవాడ కృష్ణమోహన్, కె.పి.రంగారావు, ఊరా భాస్కరరావు, మురారిశెట్టి గోపాల బాబు, దుర్గాబాబు పాల్గొన్నారు.

## పాల్వాయిగేటు పీవో, ఏపీవోలపై సస్పెన్షన్ ఎత్తివేయండి



కలెక్టరేట్‌లో డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

నరసరావుపేట: ఎన్నికల పోలింగ్ సందర్భంగా పాల్వాయి గేటు పీవో, ఏపీవోలపై విధించిన సస్పెన్షన్ రద్దుచేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ఫ్యాప్టో నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్వో కె.వినాయకంకు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సందర్భంగా మాచర్ల నియోజకవర్గంలోని పాల్వాయి గేటు పోలింగ్‌బూత్ నంబరు 202లో ఈవీఎం పగులకొట్టిన సంఘటనపై సిట్ విచారణ సందర్భంలో పీవో పీవీ సుబ్బారావు, ఏపీవో షేక్ షహనాజ్ బేగంలను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారన్నారు. ఎవరో చేసిన సంఘటనకు పీవో, ఏపీవోలను బాధ్యులను చేయడం సరికాదన్నారు. వారిపై సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లో చేర్చుకోవాలని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ నాయకులు జోసెఫ్ సుధీర్‌బాబు, ఫ్యాప్టో చైర్మన్ సంపత్‌బాబు, ప్రధాన కార్యదర్శి పి.అశోక్ కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్‌వీ రామిరెడ్డి, సీహెచ్. చంద్రజీత్ యాదవ్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ ఉస్మాన్, మక్కెన శ్రీనివాసరావు, హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, పమ్మి వెంకటరెడ్డి, రుటా అధ్యక్షులు షేక్ ముజీబ్ పాల్గొన్నారు.

## తైక్వాండోలో చీరాల క్రీడాకారుల విజయ దుందుభి



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఏకేపీ కాలేజీ యాజమాన్యం

చీరాల రూరల్: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చీరాల క్రీడాకారులు విజయకేతనం ఎగురవేశారు. పోటీలలో పాల్గొన్నవారిలో ఏడుగురు క్రీడాకారులు బంగారు పతకాలు సాధించి చీరాల ప్రతిష్ఠను ఇనుమండింపచేసినట్లు కోచ్ గూడూరి శాంతి వరప్రసాద్ తెలిపారు. ఆదివారం రేపల్లెలో రాష్ట్రస్థాయి నాలుగో సీనియర్, జూనియర్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చీరాల ఏకేపీ జూనియర్ కాలేజీలో హంటర్స్ తైక్వాండో కోచ్ గూడూరి శాంతి వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పాల్గొన్న ఎనిమిది మంది క్రీడాకారుల్లో ఏడుగురు బంగారు పతకాలు సాధించగా, ఒకరు వెండి పతకం సాధించారు. 51 కిలోల విభాగంలో జి.రవికుమార్, 42 కేజీల విభాగంలో కె.రేష్మ, 48 కిలోల విభాగంలో ఒ.సువార్త, 63 కిలోల విభాగంలో జి.శివ బాలాజీ, 45 కిలోల విభాగంలో బి.సిద్దిక్ ప్రణయ్, సీహెచ్ అభిరామ్, ఎ.యశ్వంత్, బంగారు పతకాలు సాధించగా ఎ.సుశాంత్‌కు రజత పతకం లభించింది. పతకాలు సాధించిన క్రీడాకారులను కాలేజీ యాజమాన్యం సోమవారం అభినందించింది. ఈసందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ శైలజ వాణి క్రీడాకారులను, కోచ్ శాంతి వరప్రసాద్‌ను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. కళాశాలలో హంటర్స్ తైక్వాండోకు వసతి కల్పించిన కాలేజీ యాజమాన్యానికి వరప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపక సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బాలికలకు ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

యద్దనపూడి: గ్రామీణ ప్రాంత బాలికలకు మండల కేంద్రంలోనే ఇంటర్మీడియెట్ చదివే సువర్ణ అవకాశం ఉందని హెచ్‌ఎం జి.విజయభారతి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ కేటగిరీల్లో ప్రవేశాలు జరుగుతున్నట్లు సోమవారం ఆమె వెల్లడించారు. ఇంటర్ సెకండియర్‌లో ఎంపీసీ కోర్సులో 22 మంది విద్యార్థినులు, బైపీసీలో 12 మంది చేరినట్లు వివరించారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటర్ బోధనకు అనుభవజ్ఞులైన ఏడుగురు లెక్చరర్లు ఉన్నారని తెలిపారు. ఇంటర్ చదివే విద్యార్థినులకు ఎలాంటి ఫీజులు లేవన్నారు. మరిన్ని వివరాలకు ఇంటర్ ఇన్‌చార్జి లెక్చరల్ డి.సుధీర్ సెల్‌నం: 99892 03686ను సంప్రదించాలన్నారు.

**6 నుంచి 10 వరకు ఇంగ్లిష్ మీడియంలో...**

మండల కేంద్రంమైన యద్దనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది నుంచి 6 నుంచి పదో తరగతి వరకు పూర్తిస్థాయి ఇంగ్లిష్ మీడియంలో బోధన అందిస్తున్నట్లు హెచ్‌ఎం జి.విజయభారతి తెలిపారు. తమ పాఠశాలలో చేరడం వలన ఇంగ్లిష్ మీడియం కోసం సుదూర ప్రాంతాలకు, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు వెళ్లి ఫీజులు, రవాణ చార్జీలు, ఇతరేత్ర ఖర్చులను వెచ్చించే అవసరం ఉండదన్నారు.

## భర్త లేడని మనస్తాపంతో భార్య ఆత్మహత్య

చీరాల: భర్త మరణించాడని మనస్తాపానికి గురైన భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం రాత్రి చీరాల వైకుంఠపురంలో చోటుచేసుకుంది. వైకుంఠపురానికి చెందిన తిరుమలశెట్టి దుర్గ (35) భర్త నాలుగు సంవత్సరాల క్రితం మరణించాడు. అప్పటి నుంచి మనస్తాపానికి గురై అనారోగ్యం పాలైంది. దీంతో తనువు చాలించేందుకు నిర్ణయించుకున్న ఆమె పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

■ Degree Admissions Online from 18, June B.Sc Comp Sci / Electronics, B.Com Comp App, B.A Ecom/Hist/ Spec English.BBA, PLNM Degree College, Opp: ANU ✆ 9177408565

REAL ESTATE

■ ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ల్యాండ్ పూలింగ్ 29 గ్రామాలలో రెసిడెన్షియల్ కమర్షియల్ విల్లా ప్లాట్స్, పొలాలు అమ్మాలన్నా కొనాలన్నా మాతో సంప్ర: 88278 94789

FLAT FOR SALE

■ పద్మశ్రీ నివాస్: ఇన్నర్ రింగ్‌రోడ్డు రైల్వేగేటు దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2BHK ఫుల్ ఫినిష్ లగ్జరీ ఫ్లాట్స్ 40 లక్షలకే. ఫోన్: 98481 10543, 70366 09070.

PLOT FOR SALE

■ గుంటూరు, బాపట్ల, చెరుకుపల్లి, తెనాలిలో ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగస్తులకు వ్యాపారస్తులకు అందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు అమ్మబడును, కొనబడును. సంప్ర:: 8341323726

LEASE / SALE

■ 12 ఎకరాలు నీటి వసతి గల పొలం కౌలుకు గాని/అమ్మకానికి గాని సిద్ధముగా ఉన్నది. వివరాలకు సంప్రదించండి. సెల్: 96408 47247, 70753 73118

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 83338 33368

WANTED

■ తెనాలిలోని ప్రముఖ ట్రాన్స్‌ఫార్మర్స్ కం॥లో సూపర్‌వైజర్ (M), MS ఆఫీస్ టైపింగ్ అనుభవం (3సం॥) గల సిస్టమ్ ఆపరేటర్స్ (M) కావలెను. ✆ 9490157852/ 7815829957

■ కన్నడ లేదా తమిళ్ మాట్లాడగల టెలీకాలర్స్ కావలెను. క్వాలిఫికేషన్ ఇంటర్/ డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. పని చేయుట స్థలం: గుంటూరు. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80435

■ Wanted Degree/ B.Ed. Qualified (Nursery-10th) All Subject Teachers. Salary is Negotiable. Contact: 7013703230

■ సైట్ సూపర్వైజర్లు కావలెను. బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ నందు అనుభవం ఉండవలెను. వయస్సు 30-45 సం॥లు మధ్య ఉండాలి. జీతం: upto: 25000/- పనిచేయు స్థలం: మాస్టర్‌మైండ్స్ గుంటూరు. ఫోన్ నెంబర్: 92487 33369

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/-రూ. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 7032856389

■ Wanted Male Campus incharges, Male Marketing Vice Principals and Executives. Qualification any Degree, Must be married. Salary upto 20,000/- place of work Master Minds College. Guntur. Cont: 9248733344

■ తెనాలి ITC డిపోలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ (Male) మరియు మార్కెటింగ్ సూపర్‌వైజర్లు, డ్రైవర్లు కావలెను. తెనాలి పరిసర ప్రాంతాల వారికి మాత్రమే. 9246459299

■ మాంటిస్సోరి E.M స్కూల్ శ్యామలనగర్, లక్ష్మీపురం గుంటూరు నందు పనిచేయుటకు బస్సు డ్రైవర్లు(హెవీ), క్లీనర్లు, ఆఫీసు బాయ్స్, ఆయాలు కావలెను. 8121400100

■ బార్ & రెస్టారెంట్లో P/T, F/T పని చేయుటకు వెయిటర్స్ కావలెను. రూం+భోజన వసతి కలదు. ✆ 9573271161, 8143198968

■ గుంటూరులోని సాయిధరణి రియల్‌ఎస్టేట్ నందు మార్కెటింగ్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్, లేడీ ఆఫీస్ అసిస్టెంట్ & డేటాఎంట్రీ చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. 6300313919

■ Wanted Sales executives for NEXA Car Showroom in Guntur / Rural areas. Experience/Fresher in Sales can apply. 9100787054

■ 6th class to 10th Class లకు మా స్కూలు నందు ఫిజిక్స్ మరియు గణితం బోధించడానికి అనుభవం కలిగిన ఉపాధ్యాయులు కావలెను. చేబ్రోలు. 9642254839

■ తెనాలిలోని కొత్తపేట నందు బట్టల షోరూంలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ: 14,000/- 4W/O+ESI +EPFకలవు. 9885295999, 9885125999

■ వయస్సు 30 సం॥ పైబడిన వివాహిత స్త్రీలు కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్‌గా వర్క్ చేయుటకు గుంటూరులోని ఫైనాన్షియల్ సర్వీసెస్ వారి ఆఫీసు నందు సంప్ర ✆ 75694 78729 అర్హత ఇంటర్ మీడియట్ ఉత్తీర్ణత

■ ఒంగోలు శ్రీసరస్వతి విద్యా సంస్థలు నందు పనిచేయుటకు JL's (మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ)-M/F, లేడీ PET's లేడీ క్యాంపస్ ఇన్‌చార్జిలు (కనీసం 3 సం॥లు అనుభవం కలిగిన) వార్డెన్స్ (M/F) కావలెను. ఫ్రీ వసతి, భోజనం కలదు. ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్ర:: ✆ 81420 28977, 91008 31314.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం 15-20 వేలు. కాల్/ వాట్సప్ చేయగలరు. సంప్ర. సెల్ : 85026 15217

■ లేడీ టెలికాలర్లు, హెచ్.ఆర్. మేనేజర్, రిసెప్షనిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, లేడీస్ మాత్రమే కావలెను గుంటూరులో WhatsApp 8985597933

■ A1 పెస్ట్ కంట్రోల్‌కు 20సం॥వయసు గల 10th / ఇంటర్ P/F యువకులు కావలెను. మంచి జీతం+రూమ్+మీల్స్ ఫ్రీ. వివరాలకు సంప్ర:: ✆ 84848 63989, 78818 13989.

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం ఈ పేపర్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి గుంటూరు 7075167541 7075167663

గమనిక సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలను చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.